కథా కౌముది



# జాతకచక్రం

అపర్ణ మునుకుట్ల గునుపూడి, Palo Alto, CA

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*- ఉత్తమ కథానిక విభాగంలో - ప్రశంసాపత్రం పొందిన కథ*

ఆఫీసులో పనిమధ్యన ఉండగా ఫోను మ్రోగింది. Caller ID ధర్మమా అని ఎవరు పిలుస్తున్నారో చూస్తే ఇంకెవరు, మా శ్రీవారే ఎందుకు పిలుస్తున్నారు చెప్మా అనుకుని ఫోను తీసి హాలో అన్నాను.

"ఆ విజయా నేనే, నువ్వు ఎన్నింటికి వస్తున్నావని కనుక్కుందాం అని పిలిచేను".

"అదేం ప్రశ్న? పనయ్యేకో, ముందరో మొత్తానికి సాయంత్రం ఇల్లు చేరుతాను కదా! ఎందుకడుగుతున్నారు?"

"ఆ ఏం లేదు, ఎప్పటినించో ఓ financial planner ఇంటికి వచ్చి మనం ఏం చేస్తే బాగుంటుందో చర్చిద్దాం అని పోరు పెడుతున్నాడు. ఇవాళ సాయంత్రం మనిద్దరికీ తీరికయితే వస్తానన్నాడు. ఓ గంట చాలుట. ఆరులోపల రాగలవా? "

"రెక్కాడితే కాని డొక్కాడని మన జీతాలకి పెద్ద planning ఎందుకండీ. మనం ఏం చెయ్యాలో నన్నడిగితే నేను చెప్తాను. వాడు చెప్పేదేముంది."

"అది కాదు విజయా! అన్నీ మనకి తెలుసుననుకుంటే ఎట్లాగూ? వాడికి దాంట్లో విజ్ఞానం ఉంది. పైగా మొదటి గంట ఉచితంగా చేస్తానంటున్నాడు. ఓ గంట వాడితో చర్చిస్తే ఏం పోయింది?"

"పోయేదేం లేదు. ముందర ఉచితం అంటారు, వాడి మాటలు విని మైమరిచిపోయి తర్వాత వాడి చుట్టూ మనం తిరుగుతామని వాడి నమ్మకం. ఇక అప్పుడు గంటకి అయిదు వందలో, ఆరు వందలో తీసుకుంటాడు.. మీకిదివరకు చెప్పేనో లేదో, మా బాసు ఓ రోజు ఆఫీస్‌కి దిగాలు మొహంతో వచ్చేడు. ఏం జరిగిందని అడిగితే financial planner దగ్గరనుంచి వస్తున్నా"నన్నాడు.

ఏమన్నాడని అడిగితే "ఏం బాగా చెప్పలేదు. క్రితం ఏడాది వెళితే 55 ఏళ్ళవరకూ పని చేస్తే చాలునన్నాడు. ఇప్పుడేమో దాన్ని ఇంకో మూడేళ్ళు పొడిగించి 58 చేసేడు. అదేమిట్రా అంటే cost of living పెరిగి పోతోంది. అందువలన నీ savings చాలవు అన్నాడు."

"వాళ్ళలాగే అంటారు. వాడికి ఎంత ఇచ్చేవు?"

"పన్నెండు వందలు."

"పన్నెండు వందలా! అసలు నీ దగ్గర ఎంత ఉందని వాడిదగ్గరకి వెళ్ళేవు? నన్నడిగి ఉంటే నేను ఉచితంగా చెప్పేదాన్నిగా" అన్నాను.

"ఏం నువ్వెప్పుడూ planner దగ్గరకి వెళ్ళవా?" అనడిగేడు.

వెంటనే నేను "నాకు ఎందుకూ, నా జాతకం నాకు బాగా తెలుసు" అన్నాను.

ఏమిటది అంటే వెంటనే చెప్పేను. "నా బతుక్కు నేను చచ్చేదాకా ఉద్యోగం చెయ్యాలని ఉంది. అంతకన్నా గొప్ప planning ఇంకేముంది" అన్నాను. అతను నవ్వుతూ వరస చూస్తే నా future కూడా అలాగే ఉంది అంటూ వెళ్ళి పోయేడు. అలాగ మనకెంత ఉందని అంత planning చెప్పండి. అయినా ముచ్చట పడుతున్నారు కనక వచ్చేస్తానులెండి. ఆరింటికి రమ్మాన్నారా?"

"నువ్వు వచ్చేస్తానంటే ఆరింటికి ఖరారు చేసేస్తాను."

"సరే ఆలోపల వచ్చేస్తాను. సరేనా! బై" అని ఫోను పెట్టేసి ఆలోచనలో పడింది విజయ.

ఏముంది, ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. దానికి సరిపడా ఇంటి mortgage ఉంది. ఈ ఊళ్ళో ఓ రోజు విందు మర్నాడు మందులాంటి ఉద్యోగాలు. ఏ రోజు ఉంటాయో ఏ రోజు ఊడతాయో తెలీదు. అందుకోసం కనీసం ఆర్నెల్లకి సరిపడే ఖర్చులకి డబ్బు, ఉన్న ఒక్క కొడుక్కి కాలేజీ చదువుకోసం దాచినది కొంత. ఇద్దరూ retirementకి వేసుకున్నది. ఈ మాత్రం దానికి ఏం planning చెయ్యగలం. అయినా ఏం చెప్తాడో చూద్దాం అని తిరిగి పనిలో నిమగ్నమయింది.

సాయంత్రం ఇంటికి వచ్చి వంట పని మొదలుపెట్టిన ఓ అరగంటకి వచ్చేడు. వాడి పేరు పీటర్. పరిచయాలు అయ్యేక కూచుని, మా జీతాలు, మేం ఆదా చేసిన మొత్తాలు, retirement fund లో ఎంత ఉన్నదీ అన్నీ వివరంగా చెప్పమన్నాడు ఈయన ముందుగానే సిద్ధంగా ఉండడంతో, అన్ని జవాబులకి కావలిసిన కాగితాలన్నీ తెచ్చిపెట్టుకున్నారు. పీటర్ అన్నీ చూసి, కాలేజీ ఖర్చులకి దాచిన డబ్బు ఎలా పెడితే పన్నులు లేకుండా చెయ్యవచ్చునో, retirement fundని అయిదారేళ్ళళ్ళో ద్విగుణీకృతం అయ్యేలా పెట్టుకోవాలని, మిగతా డబ్బు stocks కాని mutual funds లో కాని పెట్టాలని, stock లో పెడితే వాటిని ఎలా ఎంపిక చేయాలో వాటి EPS, PE ratioలు ఎలా చూడాలో, bond discounting అంటే ఏమిటో అన్నీ వివరంగా చెప్పేడు. వాడి కంపెనీలో account తెరిస్తే దాంట్లోనే అన్నీ manage చెయ్యవచ్చునని చెప్పేడు. మేం ఎలాగూ వేరే ఏం చెయ్యడం లేదు కనక వాడి కంపెనీ మంచి పేరున్నది కనక account తెరవడానికి సిద్ధం అయ్యేరు మావారు. మర్నాడు 11:00 కి officeకి వచ్చేరంటే అన్నీ సిద్ధం చేసి ఉంచుతాను. వెంటనే account తెరవచ్చును అని బయలుదేరేడు.

మర్నాడు ఇద్దరం వాడు చెప్పిన సమయానికి Investment office వెళ్ళి account తెరిచేం. పీటర్కి అదే కంపెనీలో ఉద్యోగం కనక విడిగా డబ్బులు ఇవ్వక్కర లేక పోయింది. ఈ account తెరిచేక మావారు కాస్త చురుగ్గా investments లో పాల్గొనడం మొదలు పెట్టేరు. Office నుంచి ఇంటికి వచ్చేప్పటికి " విజయ! ఇవాళ ఓ stock రెండు డాలర్లు పెరిగింది, మరోటి రెండు పడింది. పడ్డదాన్నమ్మేసి పెరిగే దాంట్లో వేసేసేను. "అని రోజూ జరిగిన కథలు చెప్పడం. నాలుగు రోజులు కుతూహలంగా విన్నాను. ఆ తర్వాత పాత పాటయిపోయింది. పట్టించుకోవడం మానేసేను.

ఇది ఇలా జరుగుతుండగా పిల్లాడు హైస్కూలు ముగించి కాలేజీకి apply చేయవలసిన సమయం వచ్చింది. ఈ సమయంలో ఆ వయసు పిల్లలు ఎదుర్కునేది, వద్దన్నా అందరూ అడిగేది ఒకే ఒక ప్రశ్న. ఏం చేద్దాం అనుకుంటున్నావు. వాడుకూడా అందరినీ ఆట

పట్టించడానికన్నట్టు, రోజుకో మేజర్ చెయ్యాలని ఉందనీ, లేకపోతే ఏం చెయ్యాలో తెలీదనీ అసలు కాలేజీకే వెళ్తానో లేదో అనీ జవాబు చెప్పేవాడు. చివరికి పరీక్షలు రాసి దరఖాస్తులు పెట్టే వేళయింది. అప్పుడయినా ఏదో ఒకటి తేల్చాలి కదా!

"దేనికి apply చెయ్యాలనుకుంటున్నావురా!" మావారు అడిగేరు.

"ఇంకా ఏమీ తేల్చుకోలేదు నాన్నా! history కాని, political science కాని చేస్తే ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"అదేమిట్రా!" అవాక్కయేరు మావారు.

"ఏం నాన్నా అలా చూస్తున్నారు! history తీసుకుంటే మంచి foundation వస్తుంది. ఆ తర్వాత M.B.A. చెయ్యవచ్చును. లేకపోతే politics చేస్తే లా చదవచ్చును".

"అబ్బే ఏం లేదు. history ఒక పెద్ద మేజరా! దానికి ఇంత డబ్బు పెట్టి చదవాలా? Library కి వెళ్ళి చరిత్ర పుస్తకాలు చదివితే చాలదూ. పైగా ఆ తర్వాత ఏం చేద్దామని! politics అంటే మన Indiansకి అందులో ఎంత ప్రవేశం ఉంది కనక". మా వారు ఇంకా వాడిని వెటకారం చేసి విసిగించేలోపల నేను రంగంలోకి దిగాలనిపించింది.

"చూడు సమీర్! నీ మనసుకి నచ్చింది నువ్వు చెయ్యాలనే మా ఉద్దేశ్యం కూడా. కాని నువ్వు ఇంకా ఏమీ తేల్చుకోకుండా ఉన్నప్పుడు మరి ఆ లైన్‌లోకి ఇప్పటినించే వెళ్ళడం ఎందుకు అనీ".

"అవి కాకపోతే ఇంకేం చెయ్యమంటారు. మీ మనస్సులో నేనేం చేస్తే బాగుంటుందనుకుంటున్నారో అది చెయ్యమంటారు, అంతేనా?"

"అనికాదు. నేను ముందే చెప్పేను. నీకు నచ్చింది చెయ్యాలని కాని మాకు నచ్చడం అన్నమాట ఎందుకు వచ్చింది. చదువు తర్వాత ఏం చెయ్యాలనుకుంటున్నావు, కొంచెం ముందు వెనుకా ఆలోచించాలా వద్దా! నీ కాలేజీ చదువుకి ఖర్చులు మేం పెడతాం అన్నప్పుడు నువ్వు బాగుపడాలనేగా మా ఉద్దేశ్యం."

"అవునమ్మా! అన్నీ మీకు ఇప్పుడే చెప్పేయాలంటే ఎలా కుదురుతుంది. ఇప్పుడు ఒకటి చెప్పేసి తర్వాత కాలేజీకి వెళ్ళిన తర్వాత నాకు అది నచ్చలేదనుకో అప్పుడేంచెయ్యను?"

"అంత తెలీకపోవడానికి నువ్వేం చంటిపిల్లాడివి కాదుగా, సమీర్! నిన్ను నమ్మి నీ మీద ఇంత డబ్బు పెట్టడానికి మేం తయారుగా ఉన్నాం అంటే మరి నువ్వుకూడా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలికదా! నీకు సుమారు $100K అవుతుందనుకో, నేను అంత ఖర్చు పెడితే దానికి ROI(return on investment) ఉండాలిగా! నాలుగేళ్ళ తర్వాత నీ కాళ్ళ మీద నువ్వు నిలబడగలగాలి. అదికాని పరిస్థితుల్లో నా investment దండగయినట్టేగా!" మా వారు అంటున్నారు. Investment భాష మాట్లాడుతున్నారంటే బాగా వేడెక్కిపోయేరని తెలుస్తోంది.

" ప్రతీది ROIతో లెక్క కట్టడమేనా! సరే అంటే నేను ఏం చేస్తే మీకు ROI వస్తుందనుకుంటున్నారో చెప్పండి"

"అది కాదురా! కాలేజీకి వెళ్ళడం అన్నది ఏ మేజర్ కోసం వెళ్ళడం అన్నది ప్రశ్న కాదు. అది ఒక విధంగా మీరు ఎదగడానికి ఓ అవకాశం. దేముడు దయవలన మాకు శక్తి ఉంది కనక మేం నిన్ను చదివిస్తాం అంటున్నాం. ఎంతమంది పిల్లలకి ఆ అవకాశం లేక ఎంత కష్టపడతారో నీకు తెలుసు. నువ్వు మరీ అంత అయోమయంగా కాకుండా స్పష్టంగా ఆలోచించి ఓ నిర్ణయానికి రా" అన్నాను.

"ఆలోచించడానికి ఏముంది. ఇదిగో నీ కాలేజి చదువుకి funding చెయ్యాలంటే కొన్ని షరతులు చెప్తాను విను. నువ్వు నాలుగేళ్ళలో degree ముగించాలి. ఏ మేజర్‌లో చేర్తావో ఆ మేజర్ లోనే degree తెచ్చుకోవాలి. ఆ వచ్చిన degree marketable అయి

ఉండాలి. నీకిష్టం ఉన్న కాలేజీకి వెళ్ళు కానీ చేరిన కాలేజీ నచ్చలేదని తిరిగి రాకూడదు. మా షరతులు మాత్రం మారవు". మా వారు కరాఖండిగా చెబుతూంటే వాడికి కోపం వచ్చి ఏదైనా చేస్తాడేమోనని భయం వేసింది.

కాని నెమ్మదిగానే "సరే ఇప్పుడే షరతులు చెప్పేరు కదా! నన్ను ఆలోచించుకోనివ్వండి. ఇంక నాలుగు రోజుల్లో ఎలాగూ తేల్చాలి". అన్నట్టుగానే రెండు రోజుల్లో తేల్చి చెప్పేడు. Economics and Poli. Sci. చేస్తానని. మా వారు పెద్ద ఎగిరి గంతెయ్యకపోయినా కొంచెం సర్దుకున్నట్టుగానే కనిపించేరు. Economics లో ఏదైనా ఉద్యోగాలు వస్తాయన్న నమ్మకమే మరి. దాంట్లోనే apply చెయ్యడం, admission రావడం, అయిపోయి, వాడిని దిగపెట్టే రోజు వచ్చింది. చెప్పవలసిన నీతులన్నీ చెప్పి దిగపెట్టేం.

***

రెండేళ్ళు గడిచేయి. సమీర్ చదువు సాఫీగా నడుస్తోంది. మాకు వాడు లేని ఇల్లు అలవాటయ్యింది. మా ఉద్యోగాలు, ఇంటి పనులు సాధారణ దినచర్యలు అంతా సాఫీగా ఉంటే దేముడినెందుకు తలుచుకుంటాం. అనుకోకుండా మా వారి కంపెనీలో lay off వచ్చి ఉద్యోగంలోంచి తీసేసేరు. పిల్లాడికి ఇంకా ఏడాదిన్నర చదువు ఉంది. ఇప్పుడు ఇలాగయ్యిందని అనుకుని, పోనీ ఇన్నాళ్ళు దాచుకున్నది ఇటువంటి పరిస్తితులకోసమే కదా! అని నిలదొక్కుకుని మళ్ళీ ఇంకో ఉద్యోగం కోసం ప్రయత్నిద్దాం అని సర్ది చెప్పుకున్నాం. ఇంకో ఉద్యోగానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. కాని వారి వయస్సు అయిదు పదులు దాటడంతోనో మరి ఇంకో కారణంగానో ప్రయత్న సాఫల్యం అవడం లేదు. ఆయన బాగా డీలా పడిపోతున్నారు.

ఇంతలో చాలా పేరుపడ్డ బ్యాంకు దివాళా తీస్తోందని వార్త. దాన్నంటుకుని మిగతా చిన్న చిన్న సంస్థలు దెబ్బ తినడం అన్నీ కలిసి stock market ని ముంచేయి. ఇంకా పడిపోయె ముందు సమీర్ కాలేజీకి కట్టవలసినవి బయటకి తీసేసేం. ఏం జరుగుతుందా అని అర్థం చేసుకునేలోపల మూలం కూడా నష్టం వచ్చే పరిస్థితిలోకి దిగజారిపోయింది. ఉద్యోగం పోయిందన్న బాధతో పాటు దాచుకున్న డబ్బులన్నీ హారతి కర్పూరంలా మాయం అయిపోతే ఏమీ చెయ్యలేక చూస్తూ ఉండిపోయేం. సమీర్ చదువు ఆఖరి ఏడాదికి డబ్బు కట్టేసేం. అదీ అయిపోవచ్చింది. వాడు ఉద్యోగానికి apply చెయ్యడం మొదలు పెట్టేడు. కాని ఎకానమీ ఇలా తగలడిపోవడంలో ఎక్కడా ఉద్యోగాలు లేవు. అందులో economics మేజర్. చేరిన మేజరులో నాలుగేళ్ళలో degree తెచ్చుకోవాలన్నాం. మేం పెట్టిన షరతులు తిరిగి మమ్మల్ని వెక్కిరించేయి. పోనీ ఇప్పుడు ఇంకో ఏడాది చదువు పొడిగించరా అందామంటే దానికి మళ్ళీ బోలెడు మదుపు పెట్టాలి, సరిపడా డబ్బు లేదు. వాడు చెయ్యగల్గిగిన courseలూ లేవు. ఎకానమీ పాడవుతుందని ఎవరూహించగలరు. మనం కాదనుకున్నా జరిగేవి జరగక మానవు. వాడు graduation అయ్యి ఇంకేం చెయ్యడానికి మార్గం లేక ఇంటికి వచ్చి చేరేడు.

పిల్లాడు ఇంటికి వస్తే నాకేం నష్టం లేదు. న్యాయంగా ఆనందంగా ఉండాలికదూ. అందుకు విరుద్ధంగా ఆందోళనగా ఉంది. పెరిగి పెద్దవాడై స్వతంత్రుడైన (వాడి ఉద్దేశ్యంలో) కొడుకుని చిన్న పిల్లాడని చూసినట్టు చూడలేను. అలాగని వాడి ఉనికిని విస్మరించి మా పాటికి మేం ఉండలేం. భోజనాలకి వంటచేసి పెడితే ఆ రోజు స్నేహితులతో బయటకి వెళ్ళేనంటాడు. అలాగని చెయ్యకపోతే ఆకలితో ఇంటికి వచ్చి ఏదైనా పెట్టమని అడుగుతాడు. అప్పటికప్పుడు ఏదో ఒకటి చెయ్యడం. పోనీ చెప్పి వెళ్ళమంటే ప్రతీది మీతో చెప్పి చెయ్యాలా అని విసుక్కోవడం. మరి ఇంట్లో ఉన్నప్పుడు కొన్ని నియమాలు పాటించాలికదా! అదేం లేవు. ఈ దేశంలో పెద్దవాళ్ళయిన పిల్లలతో కలిసి ఉండడం చాల ఇబ్బందే. అదేమిటో అమెరికాలో 18కే అందరూ బయటికి వెళ్ళిపోతారు. ఇళ్ళకి తిరిగి చుట్టపుచూపుగా తప్ప రారు అని పుస్తకాల్లో చదివినదంతా ఏమయిందో! దానికి తోడు ఈయన వాడు చేసే పనులకి నన్ను షంటడం. మరి నేను ఆఫీస్‌కి వెళ్ళిన సమయంలో ఏం వాద ప్రతివాదాలు చేసుకుంటారో కాని వచ్చేప్పటికి మాత్రం ఇద్దరూ మాటమంతి లేకుండా ఉంటారు. ఇద్దరిలో ఎవరిని మాట్లాడిద్దాం అన్నా ఎందుకో బెరకుగా ఉంటోంది. నా ఇంట్లో నాకు చాలా దగ్గర వాళ్ళే అనుకోకుండా దూరం

అవుతున్నారు. పిల్లాడు సరిగ్గా ఉద్యోగ ప్రయత్నాలు చెయ్యడం లేదని ఆయన ఆరోపణ. నా ప్రయత్నాలు నేను చేసుకుంటాను నన్ను వొదిలెయ్యండి బాబూ, ఏది పడితే అది తీసేసుకుంటే మళ్ళీ కెరీర్ పాడవుతుందంటాడు వాడు. వాడి గొడవ వాడిది. ఇద్దరికీ మధ్యని నేను క్షోభతో నలిగిపోతున్నాను. భవిష్యత్తు ఎంత ప్లానింగ్ చేసేం. అంతా దీనికేనా? మొగుడికి ఉద్యోగం పోయింది. దాచుకున్న డబ్బులు ఖాళీ అయిపోయేయి. నిక్షేపంగా చదువుకున్న కొడుక్కి ఉద్యోగాలు కరువయ్యేయి. భగవంతుడా! ఏమిటీ విపరీతం! ఇంకా నయం. దేముడు నాయందున్నాడు. నాకింకా ఉద్యోగం ఉండడంతో ఈమాత్రం ఇల్లు, ఇన్సూరెన్సూ నిలుపుకోగలిగేం. లేకపోతే చెట్టుక్రింద నిల్చోవాలి. ముందే చెప్పలేదూ, నా జాతకంలో నే చచ్చేంతవరకు ఉద్యోగం చెయ్యాలని!

Click here to share your comments on this story